కూలీల కొరత.. ఖర్చుల మోత

మండలంలో వరినాట్లు జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలో కూలీలకు డిమాండ్ పెరిగింది. వారి కోసం రైతులు చుట్టుపక్కల గ్రామాల్లో ఆరా తీస్తున్నారు. దొరక్కపోవడంతో ఇతర రాష్ట్రాలకు చెందిన వారిపై ఆధారపడుతున్నారు. అలాగే సాగు ఖర్చులు పెరిగాయి.

- గ్రామాల్లో ముమ్మరంగా వరినాట్లు
- కూలీలు దొరక్క అన్నదాతల ఆందోళన
- పొరుగు రాష్ట్రాల వారిపై ఆధారపడుతున్న వైనం
- మరోవైపు పెరిగిన పెట్టుబడులు



వరి నాట్లు వేస్తున్న కూలీలు

పొదలకూరు: గ్రామాల్లో వరినాట్లు వేస్తున్నారు. సంక్రాంతి పండగ వరకు కొనసాగే అవకాశం ఉంది. మండలంలో సుమారు 20 వేల ఎకరాల్లో వరినాట్లు పడే అవకాశం ఉంది. అయితే అధికారికంగా 14 వేల ఎకరాలనే లెక్కలు కడుతున్నారు. మెట్ట పంటల సాగు చేపట్టిన రైతులు మినుము, పెసరలకు సోకిన తెగుళ్లకు మందు పిచికారీ చేసుకుంటుండగా వరినాట్లు వేసేందుకు కూలీల కోసం రైతులు వాకబు చేస్తున్నారు. దాదాపు జిల్లా అంతా ఒకే సీజన్‌లో వ్యవసాయ పనులు మొదలు కావడంతో కూలీల కొరత ఏర్పడింది. ఫలితంగా బంధువులు, స్నేహితులు, తోటి రైతులను పిలుచుకుంటున్న పరిస్థితులున్నాయి.

పెట్టుబడుల భారం

వరి సాగు పెట్టుబడులు బాగా పెరిగాయి. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.22 వేల వరకు ఖర్చవుతున్నట్టు రైతులు చెబుతున్నారు. ఎరువుల ధరలు ఆకాశాన్ని కొనలేకపోతున్నారు. యూరియా బస్తా నిబంధనల ప్రకారం రూ.262 విక్రయించాల్సి ఉండగా మండల కేంద్రం, చుట్టుపక్కల గ్రామాల్లో రూ.280 నుంచి రూ.300 కూడా అమ్ముతున్నారు. కాంప్లెక్స్ ఎరువుల రేట్లు విపరీతంగా పెరగడంతో వ్యవసాయం చేసేందుకు జంకుతున్న పరిస్థితులున్నాయి. ఇంకా కొందరు రైతులు ఇష్టానుసారంగా ఎరువుల వినియోగంతో ఖర్చులు పెరుగుతున్నట్టుగా తెలుస్తోంది. 28:28:0 బస్తా రూ.1,800, 20:20:0:13 బస్తా రూ.1,300, 10:26:26 బస్తా రూ.1,470 వంతున ధరలున్నాయి.

ఎకరాకు ఎంతంటే..?

ప్రస్తుతం ఎకరా పొలంలో నాట్లు వేసేందుకు రూ.4,500 కూలీలకు చెల్లించాల్సి వస్తున్నట్టు రైతులు వెల్లడించారు. ఇతర ప్రాంతాల నుంచి నాట్లు వేసేందుకు ముఠాలు గ్రామాలకు వస్తున్నాయి. కొందరు మేస్త్రీలు బిహార్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి కూలీలను రప్పిస్తున్నారు. వీరు పది ఎకరాలకు పైబడిన రైతులకు నాట్లు వేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంటున్నారు.

కష్టంగా ఉంది



వరినాట్లు వేసేందుకు కూలీలతో కష్టంగా ఉంది. రబీలో రైతులు ఒకే సమయంలో నాట్లు వేస్తుండటంతో స్థానికంగా కూలీలు లభ్యం కావడం లేదు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ముఠాలు నాట్లు ఎడం వేస్తుండటంతో కొందరు రైతులు ఇష్టపడటం లేదు. ఎరువుల ధరలు పెరిగాయి.

– పి.శ్రీనివాసులురెడ్డి, రైతు, నల్లపాళెం

50 శాతం నాట్లు వేశారు



మండలంలో 50 శాతం నాట్లు వేశారు. మరో 50 శాతం నాట్లు పూర్తి కావాల్సి ఉంది. మొత్తంగా చూసుకుంటే 14 వేలకు పైగా ఎకరాల్లో నాట్లు పడే అకాశం ఉంటుంది. రబీలో సాగునీటి సమస్యలు ఉండవని భావిస్తున్నాం. చెరువులు పూర్తిగా నిండకున్నా ప్రాజెక్ట్‌ల నుంచి నీరు అందుతుంది. ఈనెలలో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు సమాచారం ఉంది.

– ఎ.వాసు, ఏఓ, పొదలకూరు

క్లుప్తంగా

ప్రజల ఆదరణ మరువలేనిది



నెల్లూరు(బారకాసు): నగరంలోని 16వ డివిజన్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ప్రజలు చూపిన ఆదరణ మరువలేనిదని ఎమ్మెల్సీ, పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. రామ్‌జీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన డివిజన్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో పార్టీ విజయం కోసం డివిజన్లోని అనేక మంది నేతలు కృషి చేశారని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ.. కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా, పార్టీ అండగా ఉంటుందనే భరోసాను కల్పించాలని సూచించారు. డివిజన్లో ప్రాధాన్యమున్న మరికొందరు నేతలకు పార్టీ కమిటీల్లో స్థానం కల్పిస్తామని చెప్పారు. అనంతరం పార్టీ డివిజన్ అధ్యక్షుడిగా నేత సగిలి జయరామిరెడ్డిని నియమించారు.

ఘనంగా హిందీ గాన జయంతి



నెల్లూరు(బృందావనం): క్రీస్తు జనన వృత్తాంతాన్ని పాటల రూపంలో అందించే హిందీ సంగీతోత్సవ గాన జయంతిని నగరంలో ఆదివారం నిర్వహించారు. వీఆర్సీ సెంటర్ సమీపంలోని బాప్టిస్ట్ చర్చి డానీ హాల్లో సంఘ కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్, బ్రదర్ జానీజో ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత కార్యక్రమానికి సాహిత్యాన్ని మీనా రజనీష్, క్రిస్టఫర్ అందించారు. స్వరకల్పన, సంగీతాన్ని గుర్రం సుధాకర్‌రావు, జమ్ముల జయకుమార్, జెన్నీ జోయల్ శ్యామ్ అందజేశారు. సంఘ కాపరి రెవరెండ్ కంది శ్యామ్‌సన్‌కుమార్ వాక్యోపదేశం చేశారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. గాయక బృందం మహేష్, కల్యాణ్, అనిల్, జితేందర్ పల్వాన్, సింధు, సాత్విక్, క్రిస్టీ, విహారి, సంఘ పెద్దలు నిర్మల సుధాకర్, గంటా జార్జిస్టీవెన్సన్, కృపారాజన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీర్ల సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా రియాజ్



నెల్లూరు(అర్బన్): రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజినీర్ల సంఘ గౌరవాధ్యక్షుడిగా నెల్లూరుకు చెందిన రియాజ్ అహ్మద్‌ను తిరిగి ఎన్నుకున్నారు. తిరుపతిలోని ఓ కన్వెన్షన్ హాల్లో సంఘ రాష్ట్ర సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను ఎన్నుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజినీర్ల సంఘ అధ్యక్షుడిగా, రాష్ట్ర జేఏసీలో వైస్ చైర్మన్‌గా పనిచేశారు. ఉద్యోగ విరమణ పొందినా రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. పూర్వ ఉద్యోగ సంఘ జేఏసీ చైర్మన్ అశోక్‌బాబు, ప్రస్తుత చైర్మన్ శివారెడ్డి అభినందించారు.

దేవదాయ శాఖ అధికారి కార్యాలయ ప్రారంభం

నెల్లూరు(బృందావనం): దేవదాయ శాఖ జిల్లా అధికారి నూతన కార్యాలయ భవనాన్ని రంగనాయకులపేటలోని చిత్రకూటంలో ఆదివారం ప్రారంభించారు. గృహ ప్రవేశం, దివ్య ప్రబంధ సేవాకాలం, వాస్తు హోమాన్ని నిర్వహించారు. దేవదాయ శాఖ, తల్పగిరి రంగనాథస్వామి దేవస్థాన అనుబంధ సంస్థ ముప్పిరాల నరసింహాచార్యులు నిర్దిష్ట ధర్మదాయం నుంచి కార్యాలయాన్ని నిర్మించారు.

నేటి నుంచి ధనుర్మాస పూజలు



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం నుంచి ధనుర్మాస పూజలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు ఆదివారం వెల్లడించారు. ఈ పూజలు జనవరి 14వ తేదీ వరకు జరుగుతాయన్నారు. రోజూ తెల్లవారుజామున 4.30 నుంచి 6.30 గంటల వరకు ప్రత్యేక పూజలను నిర్వహిస్తామన్నారు. దంపతులు రూ.500 చెల్లిస్తే ధనుర్మాసమంతా గోత్రనామాలతో పూజలు చేయిస్తామని తెలిపారు.

కోడూరు సాగర తీరంలో సందడి



తోటపల్లిగూడూరు: ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కోడూరు బీచ్‌కు ఆదివారం జనం పోటెత్తారు. కుటుంబాలు తరలిరావడంతో బీచ్ పరిసరాల్లో సందడి నెలకొంది. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సందర్శకుల రాక సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో మనుబోలమ్మ

మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలు గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మలకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఫణీంద్ర శర్మ పంచామృతాభిషేకాలు చేశారు. ప్రత్యేకాలంకరణ అనంతరం విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్థానికులు అధిక సంఖ్యలో గ్రామదేవతలను దర్శించుకున్నారు.

యోగా తరగతులు



యోగా చేస్తున్న విద్యార్థినులు

మనుబోలు: మండల కేంద్రమైన మనబోలులోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో ఆదివారం విద్యార్థినులకు యోగా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రెయినర్ చెలికం కోటేశ్వరరెడ్డి మాట్లాడుతూ రోజూ గంటసేపు యోగా చేయాలని సూచించారు. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరిగేందుకు యోగా దోహదపడుతుందన్నారు. క్రమశిక్షణతో కూడుకున్న జీవన విధానానికి యోగా మార్గం చూపుతుందన్నారు. ఆయన వెంట హాస్టల్ మేట్రిన్ మహేశ్వరి ఉన్నారు.

నూతన కార్యవర్గ ఏర్పాటు



మాట్లాడుతున్న నేతలు

కోవూరు: మెరుగైన విద్యుత్ సేవలను అందించడమే లక్ష్యంగా కోవూరు డివిజన్ కార్యవర్గాన్ని ఏర్పాటు చేశామని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు, జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి సుధాకర్‌రావు పేర్కొన్నారు. మండలంలోని పుచ్చలపల్లి సుందరయ్య కల్యాణ మండపంలో యూనియన్ మహాసభ, నూతన కార్యవర్గ ఎన్నికను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యుత్ సంస్థ ప్రైవేట్‌పరం కాకుండా యూఈఈయూ అలుపెరగని పోరాటం చేస్తోందని చెప్పారు. డివిజన్ అధ్యక్షుడిగా సురేంద్ర, ప్రధాన కార్యదర్శిగా దయాకర్, కోశాధికారిగా వాసుదేవరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా షాహుల్, కార్యవర్గ సభ్యులుగా 15 మందిని ఎన్నుకున్నారు.



కార్యవర్గ సభ్యులు

కోడూరు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు వేళాంగిణి చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా చర్చి డైరెక్టర్ ఫాదర్ లూకాస్‌రాజ్ సందేశాన్నిచ్చారు. వేళాంగిణిమాతను నమ్మితే సకల సౌఖ్యాలు సిద్ధిస్తాయని పేర్కొన్నారు. అమ్మను సేవించి పుణ్యక్షేత్రంలో జాగరణ చేస్తే కష్టాలు తీరిపోతాయన్నారు. జిల్లా నలువైపుల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



ఇందుకూరుపేట: గాంధీ ఆశ్రమంలో..

పొదలకూరు: పొట్టి శ్రీరాములు వర్ధంతిని పట్టణంలోని ఆర్యవైశ్య ప్రముఖులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రభుత్వం ఆయన వర్ధంతిని ఆత్మార్పణ దినోత్సవంగా ప్రకటించడం మంచి పరిణామంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆదూరు వెంకటసుబ్బయ్య, ఆమల్తులూరు చెంచయ్య, పొట్టి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

- ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడులో గల పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో సర్దార్ వల్లభ్‌భాయ్‌పటేల్, అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీరి చిత్రపటాలకు నివాళులర్పించారు. తొలుత ఆశ్రమ ఆవరణలోని గాంధీ, స్థలదాత పొణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఆశ్రమ కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, ఆశ్రమ కమిటీ సభ్యులు గంపల మంజుల తదితరులు పాల్గొన్నారు.
- బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుప్రజ తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరులో..



బుచ్చిరెడ్డిపాళెంలో..

ఆటో కార్మికుల సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదును నిర్వహిస్తున్న నేతలు

ముత్తుకూరు: మండలంలో ఆటో కార్మికుల సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ముత్తుకూరు, పంటపాళెం, పిడతాపోలూరు క్రాస్‌రోడ్డు వద్ద సభ్యత్వ నమోదును ఆటో కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మారుబోయిన రాజా, కోలగట్ల సురేష్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో, ట్రాన్స్‌పోర్టు రంగాలకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గడ్డం అంకయ్య, విజయ్, వావిళ్ల వెంకయ్య, బెల్లంకొండ సురేష్, సీతారామయ్య పాల్గొన్నారు.

కళా సేవలు అభినందనీయం

నెల్లూరు(బృందావనం): కళారంగానికి కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కేతా సుబ్బారావు అందిస్తున్న సేవలు ఎనలేనివని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మాగుంట లేఅవుట్లో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్వాహకుడు కుమార్ ఆధ్వర్యంలో కేతా సుబ్బారావును ఆదివారం సత్కరించారు.

పూడిక తొలగించేవారేరీ..?



పూడిపోయిన నాగమాంబాపురం కాలువ



పేరుకుపోయిన గడ్డి, నాచు

- గడ్డి, నాచుతో నిండిపోయిన కాలువలు
- పట్టించుకోని నీటిపారుదల శాఖ

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలో నీరు సమృద్ధిగా ఉన్నా, రైతులు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికే వరినాట్లు పూర్తయ్యాయి. అయితే కాలువల్లో పేరుకుపోయిన గడ్డి, నాచు, పూడికను తొలగించే దిశగా నీటిపారుదల శాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. కనిగిరి రిజర్వాయర్ నుంచి వెళ్లే నాగమాంబాపురం కాలువ కింద సుమారు 800 ఎకరాలు సాగులో ఉంది. కాలువ పూడిక తీయాలని అధికారులకు రైతులు విన్నవించినా ప్రయోజనం లభించడంలేదు. రేబాల, వవ్వేరు, నాగమాంబాపురం, దామరమడుగు కాలువలూ ఇదే పరిస్థితిలో ఉన్నాయి. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి వీటిని తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మలుపు.. ముప్పు



ప్రమాదకర మలుపు

పొదలకూరు: మండలంలోని పొదలకూరు - కలువాయి మార్గం లింగంపల్లితోపునకు సమీపంలో ఉన్న మలుపంటే వాహనచోదకులకు హడల్. ఈ మార్గంలో కొత్తగా వాహనం నడిపే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. మలుపు మీదుగా వెళ్లే సమయంలో ఎదురుగా వచ్చే వాహనం సరిగా కనిపించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు ఈ మలుపు వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం లేదు. పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగినా స్పందించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల్సిందిగా వాహనచోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు.